క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ధర్మవరం స్టేజీ వద్ద బీఆర్ఎస్ నాయకుడు రామాంజి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రారంభించారు. ప్రయాణికుల యొక్క దాహార్తిని తీర్చడం కోసం కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు తిరుపతయ్య, శ్రీనాథ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీహరినాయుడు, కృష్ణయ్య పాల్గొన్నారు.

25 నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

గద్వాల రూరల్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీ నుంచి విద్యుత్ శాఖ డివిజన్ ఆఫీస్ ఎదుట శాంతియుతంగా సమ్మె చేపడుతున్నట్లు విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 82 నాయకులు రఫీ, సుధాకర్‌లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా యూనియన్ రాష్ట్ర నాయుకుడు సాయిలు అరెస్టును ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం పంచలింగాల గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. బైరాపురం శివారుకు రాగానే కానిస్టేబుల్ రవి ట్రాక్టర్ పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ యజమాని ఎల్లప్ప, డ్రైవర్ చిరంజీవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అండగా ఉంటాం

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంటలో వృద్ధుడు నర్సయ్య కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నడిగడ్డ పోరాట సమితి నాయకులు భీమన్‌గౌడ్, దస్తగిరిగౌడ్ శనివారం గ్రామానికి చేరుకొని వృద్ధుడిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో గంగావతి, ఏసు, రాముడు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన డక్కలి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమనాద్రి సూచన మేరకు సభ్యులు రూ. 5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు గట్టుబాబు, సురేష్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

లోకాయుక్తకు ఫిర్యాదు

ధరూరు: భూ సమస్యకు సంబంధించి తమకు న్యాయం చేయాలని లోకాయుక్తకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే ధరూరు గ్రామానికి చెందిన దాదెపోగు మద్దిలేటి తాత సంపంగి నర్సన్న పేరుపై సర్వే నంబరు 33/15లో 3 ఎకరాల19 గుంటల భూమి ఉంది. ఈ భూమి దోర్నాల గ్రామానికి చెందిన సవారన్న కుమారులు తమ భూమి అని ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న నర్సన్న తండ్రి నాగన్న, లొడ్డన్న తండ్రి సవారన్న, నర్సింహులు తండ్రి సవారన్న, వెంటన్న తండ్రి కొండ పులిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మానవ హక్కుల కమిషన్‌కు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోయాడు. మాకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

గద్వాల రూరల్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రంలోని ఐకేపీ కేంద్రం ఎదుట ఆరో రోజు వీఓఏల సమ్మె కొనసాగించారు. శనివారం బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ సీసల వెంకటర్‌రెడ్డి వారిక సంఘీభావం తెలిపారు. వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు డ్యాం అంజి, తిమ్మప్ప, వెంకటరామయ్య, లక్ష్మన్న, వెంకటేష్, సుధాకర్, రేణుక, తులసి, కళావతి పాల్గొన్నారు.

మల్దకల్: వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం మండల నాయకులు బాషా, చంద్రాములు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనం ఎదుట వీఓఏలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఓఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రతతో పాటు రూ.10 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెందిన వీఓఏలు మహేందర్, శంకర్‌గౌడ్, గోవిందు, మునిస్వామి, హనుమంతు, వెంకట్రాములు, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాజోళిలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు



ఉండవెల్లిలోఎస్‌ఐతో ముస్లిం పెద్దలు



మానవపాడులో పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

ఘనంగా ఈద్ ఉల్ ఫితర్



గట్టు ఈద్గా వద్ద..



అలంపూర్‌లో పండగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం



మల్దకల్‌లో ధార్మిక సందేశం ఇస్తున్న మత బోధకుడు

అలంపూర్: రంజాన్ పండుగ పర్వదినం సందర్భంగా శనివారం ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలు విరమించారు. కొత్త దుస్తులు ధరించి ఈద్గాలకు సముహంగా వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. అలంపూర్ పట్టణంలోని పాత, కొత్త ఈద్గాలలో నమాజ్ చేశారు. పండుగలో భాగంగా ఫిత్రా, జకాత్‌లను చెల్లించి పండుగ సంప్రదాయాన్ని కొనసాగించారు. అలంపూర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

రాజోళి: మండలంలో రంజాన్ పండుగ సందర్భంగా శనివారం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ స్వీట్లు పంచుకున్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ చేసుకున్నారు. మండల కేంద్రంలో ఈద్గా వద్ద ఎస్‌ఐ బాల్‌రాజు ఈద్ ముబారక్ తెలిపారు.

మానవపాడు: మండల కేంద్రంలోని జామియా మసీదులో రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం ఈద్గాల వద్ద ముస్లిం మత పెద్దలు ఖురాన్ విశిష్టతను వివరించారు. పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు ఎస్‌ఐ సంతోష్ బహుమతులు అందజేశారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ శ్రీనివాసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

అయిజ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి మసీదులు, ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదవారికి వివిధ రకాల కానుకలు అందజేశారు.

మల్దకల్: మండలంలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు అనంతరం మతపెద్దలు ధార్మిక సందేశం ఇచ్చారు.

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్‌ను ఘనంగా జరుపుకున్నారు. గట్టు, మాచర్ల, బల్గెర, ఇందువాసి, బోయలగూడెం, ఆలూరు, ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో ఈద్గాల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం రంజాన్ పండుగ పురస్కరించుకొని ఢిల్లీలో అధికార ప్రతినిధి డాక్టర్ మందా జగన్నాథం, సూర్యా నాయక్, ఎంపీపీ స్నేహ, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు నెట్టెంపాడు, చింతరేవుల, ఉప్పేరు, ర్యాలంపాడు తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద శనివారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, ఏఎస్ వెంకట్రాములు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును చేపట్టారు.



అయిజలోని ఈద్గా వద్ద ..



ఉండవెల్లి ఈద్గా వద్ద ప్రార్థనలలో పాల్గొన్న చిన్నారులు



మానవపాడులో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్‌ఐ సంతోష్



ధరూర్ ఈద్గా వద్ద..



శాంతినగర్‌లో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న మిత్రులు



ధరూరులో చిన్నారుల సందడి

మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి



మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఉండవెల్లి: మొక్కజొన్న ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న డిమాండ్ చేశాడు. శనివారం మండల కేంద్రంలో రైతులు ఆరబోసిన మొక్కజొన్నను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటను ఆరబోసిన కల్లాల దగ్గరికి వెళ్లి కొనుగోలు చేయాలని కోరారు. పంటకు మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించాలన్నారు. సీఐటీయూ మండల నాయకులు వెంకటేశ్వర్లు, హమాలీ వెంకట్రాముడు, రైతులు గోవిందు, సుధాకర్, అచ్యుత్‌రెడ్డి, మహేష్, వెంకటేశ్వర్లు, బీచుపల్లి పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అర్చకులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అదే విధంగా స్వామి వారికి దాసంగా పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి నాయకులు చంద్రశేఖర్‌రావు, సవారి, ఆలయ సిబ్బంది శ్రీను, ఉరుకుందు, రంగస్వామి, శివమ్మ, కృష్ణ ఉన్నారు.

వర్షంతో రాకపోకలకు ఆటంకం



చిన్న తాండ్రపాడు కల్వర్టుపై నుంచి పారుతున్న వరదనీరు

అయిజ: మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షం కురిసింది. శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ప్రజలు అవస్థలు పడ్డారు. వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. చిన్న తాండ్రపాడు- అయిజ రోడ్డుపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరకొని సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు అవస్థలు ఎదుర్కొన్నారు. కురిసిన వర్షానికి కల్వర్టుపై వరదనీరు పారుతుండడంతో వాహనదారులు రోడ్డు దాటేందుకు భయాందోళనకు గురయ్యారు. ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణించారు. మోకాల్లోతు వర్షపు నీరు నిలచింది. దీంతో వివిధ గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కల్వర్టును పునర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. 11.4 మిల్లీమీటర్లుగా నమోదైంది. వ్యవసాయ పొలాల్లో ఆరబెట్టుకున్న వరిధాన్యం తడిసింది. అదేవిధంగా మిరప కూడా తడవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

అయిజ: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. శనివారం తుపత్రాలలో మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. డ్రైయినేజీలను పరిశీలించారు. వార్డు ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించాలని కాలనీవాసులు విన్నవించారు. కార్యక్రమంలో మున్సిపల్ లైన్‌మెన్ నరసింహులు, బిల్ కలెక్టర్లు నరేష్, అడివన్న, మహేంద్రనాథ్, నాగరాజు, ఆంజనేయులు, వీరేష్, అశోక్, జవాన్లు ప్రకాష్, ఆనంద్, ఎలక్ట్రీషియన్లు సురేష్, జయరాములు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన రైతు సంఘం నాయకులు

శాంతినగర్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతు సంఘం నాయకులు శనివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను జోగుళాంబ గద్వాల జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు ఎనుముల నాగరాజు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అకాల వర్షాల కారణంగా మొక్కజొన్న రైతులు నష్టపోయారని వివరించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యాన్ని దళారులకు క్వింటాల్ రూ.300 నుంచి రూ.350 వరకు తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు. ఆయన స్పందిస్తూ రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వెంకట్రామన్, యోగిరెడ్డి తదితరులు ఉన్నారు.

రాజోళి: అలంపూర్ నియోజకవర్గంలో వచ్చే నెల 9 నుంచి హాథ్ సే హాత్ జోడో పాదయాత్ర ప్రారంభంకానున్న సందర్భంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. అలంపూర్‌లోని జోగుళాంబ సన్నిధి నుంచి మొదలుకానున్న యాత్రపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, నాయకులతో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో దస్తగిరి, కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని నిరసన



షేకుపల్లిలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, గ్రామస్తులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణలో పల్లెలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కరువైందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని ఆర్ గార్లపాడు, దువాసిపల్లి, షేకుపల్లి గ్రామాల్లో ప్రజలు, విద్యార్థులు బస్సు దీక్షను చేపట్టి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. దీక్షకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. బస్సు సౌకర్యం కోసం ప్రజలు దీక్షలు చేస్తుంటే పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, ఆస్పత్రులకు వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపించారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి గద్వాల డిపో నుంచి ఎర్రవల్లి, పల్లెపాడ్ మీదుగా అలంపూర్ వరకు పల్లెల మీదుగా బస్సులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, రాంబాబు, ఉపేందర్, భీమన్న, పరుశరాముడు, బీసన్న, రవి, కిరణ్, బీసన్న, తిమ్మారెడ్డి, రమేష్, తదితరులు ఉన్నారు.

మానవపాడు: మండలంలోని పల్లెపాడు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పల్లెపాడులో చేపట్టిన బస్సు దీక్షకు ఆయన సంఘీభావం ప్రకటించారు. గ్రామస్తులు, విద్యార్థులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, మద్దిలేటి, పుల్లన్న, తిరుపాల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.